**కథ**

## పుష్కరకాలం సమీపించగానే గోదావరిలో సంచలనం ప్రారంభమైనట్టు...గోదావరీ ప్రవాహాన్ని చూస్తూనే నాలో సంచలనం మొదలైంది.

నా ఎదురుగా గోదావరి..అఖండ గోదావరి!

తర తరాల కథలను, స్మృతులను అంతరంగంలో దాచుకుని గంభీరంగా, నిండుగా వున్న గోదావరి! నా చిన్ననాటి జ్ఞాపకాల మధ్య పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.

నేను గోదావరిలోనే...గోదారి నాలోనే మిళితమవుతున్న భావన! అనిర్వచనీయమైన ఈ అనుభూతికి కారణం వుంది. చాలాకాలం తర్వాత తిరిగి నేల మీద అడుగుపెట్టడమే! ఇరవై సంవత్సరాల తర్వాత తిరిగి మా ఊళ్ళో అడుగుపెట్టబోతున్నా. జ్ఞాపకాలను నెమరేసుకోబోతున్నాను.



ముందుకి వంగి దోసిలినిండా నీళ్ళు తీసుకుని మొహం మీద జల్లుకున్నాను. పాదాలను తడుపుతున్న కెరటాల స్పర్శ, అమ్మ చేతి స్పర్శను గుర్తుకు తెస్తోంది.

''బాబుగోరూ..బేగిరండి..'' లాంచీవాడి అరుపుకి వెనక్కి తిరిగాను.

లాంచీ బయల్దేరడానికి సిద్ధంగా వుంది. గబగబా వెళ్ళి ఎక్కాను. లాంచీలో ఓ చివరగా కూర్చుని ఒకలాంటి ఉద్వేగ్నతతో పరిసరాలను గమనిస్తున్నాను. అద్భుతమైన ప్రశాంతత ఏదో మనసుని ఆహ్లాద పరుస్తోంది.

ఎప్పటివో జ్ఞాపకాలు గుండెని గోరు వెచ్చగా స్పృశిస్తున్నాయి. గోదారి అలల విరుపుల్లో ఇరవై ఏళ్ళ నాటి జ్ఞాపకాల శకలాలు కొట్టుకు వస్తున్నాయి.

చలికాలపు తొలి ప్రొద్దున మంచు తెరల మధ్య నుంచీ, అలవోకగా కదిలే గోదావరి కెరటంలా-అర్ధరాత్రి నిశ్శబ్దంలో మూసిన కనురెప్పల వెనుక మెత్తగా, కదలాడే కమనీయ స్వప్నంలా.

'వసుధ'

ఒక రీవీ, ఒక సోయగం, ఒక ఆహ్లాదం..కలిస్తే వసుధ

ఆ నిర్మలత్వం, ఆ వ్యక్తిత్వం, నన్నిటప్పటికీ వెంటాడే ఒక తీయని జ్ఞాపకం!

ఇప్పుడెలా వుందో!

సన్నజాజిలా నాజూగ్గా వుండే వసుధ, బొండుమల్లెలా బొద్దుగా తయారై వుంటుందా? తలలో అక్కడక్కడా తొంగి చూసే తెల్లవెంట్రుకలతో, వయసు తెచ్చిన గాంభీర్యంతో నిండు గోదావరిలా వుంటుందా?

నవ్వుకున్నాను.

క్షణం తీరిక దొరకని హడావుడి జీవితం, బాధ్యతల పేజీ మరుగున ఆమె జ్ఞాపకం మనసు అట్టడుగు పొరల్లో జారిపోలేదు. ఒక మంచి పాట విన్నప్పుడో, ఒక సుందర దృశ్యం చూసినప్పుడో మెరుపులా మనసులో మెదులుతూనే వుంటుంది.

ఆ ఫీలింగ్. అప్పట్లో వసుధంటే నాకెంతో ప్రేమ. ఇప్పుడా ప్రేమ స్థానంలోనే ఆప్యాయత చోటుచేసుకుంది.

లాంచీ ఒడ్డుని సమీపిస్తోంది. నేను ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఊరిని, ఇళ్ళనీ ఒకలాంటి ఆత్రుతతో పరికిస్తున్నాను. ఊళ్ళోకి దారి తీసాను.

ఇరవై ఏళ్ళలో వూరు చాలా మారిపోయింది. కాఫీహోటళ్ళు, కిళ్ళీబంకులు వెలిసాయి. టీవీలు ఇంటింటా రంగప్రవేశం చేసిన గుర్తుగా, ఇంటి పై కప్పుల మీద యాంటీనాలు కనబడుతున్నాయి. ఈ మారుమూల పల్లెటూళ్ళోకి కూడా ఛానెళ్ల నాగరికత కొండ చిలువలా ప్రవేశించింది.

వీధి చివర వున్న పెద్ద డాబా ఇంటి ముందు ఆగాను. ఆ ఇల్లు, వసారా, ఇంటి ముందున్న కొబ్బరిచెట్లు అన్నీ అలాగే వున్నాయి. పెద్దగా మార్పేమీ లేదు.

వీధి తలుపులు తీసే వున్నాయి. మెట్లు ఎక్కి వాకిట్లో నిలబడి, లోపలికి తొంగిచూసాను. అప్పుడే లోపలి గది లోంచి హాల్లోకి వస్తున్న రమణ కనిపించాడు.

''రమణా!'' అరిచాను ఆనందంగా!

రమణ ఒక్కక్షణం నన్ను పరికించి చూసి, ''శ్రీధర్..నువ్వా?'' సంభ్రమాశ్చర్యాలతో అంటూనే, ఒక్క అంగలో వచ్చి నన్ను చేతులతో చుట్టేసాడు.

''ఇన్నేళ్ళకి గుర్తొచ్చామా..మేమూ, మా ఊరూ?'' నిష్ఠూరంగా అంటూ, నా భుజాల చుట్టూ చెయ్యేసి లోపలికి తీసుకు వెళ్ళాడు.

''ఓసారి వచ్చి మిమ్మల్నందర్నీ చూడాలని ఎన్నాళ్ళ నుండో అనుకుంటుంటే....ఇప్పటికి వీలైంది'' కూర్చుంటూ అన్నాను.

''రాధా..'' లోపలికి చూస్తూ పిలిచాడు.

కొంగు భుజాల మీదకు లాక్కుంటూ, మంచి నీళ్ళ గ్లాసుతో వచ్చిన ఆమెను చూపిస్తూ, ''నా శ్రీమతి రాధ'' పరిచయం చేసాడు రమణ.

ఆమె గ్లాసు నాకందించి, చిరునవ్వుతో రెండు చేతులూ జోడించింది.

''నేనెప్పుడూ చెబుతూంటానే శ్రీధర్ అని..ఇతనే..'' చెప్పాడు భార్యతో.

''ఆయనెప్పుడూ మీ గురించి చెబుతూనే వుంటారు. మాట్లాడుకుంటూ వుండండి కాఫీ తెస్తాను.'' ఆమె నవ్వుతూ లోపలికి వెళ్ళిపోయింది.

నా ఎదురుగా ఉయ్యాల బల్ల!

దాన్ని చూస్తుంటే వసుధ గుర్తొచ్చింది. కాళ్ళకీ చేతులకీ గోరింటాకు పెట్టుకుని దాని మీదే కూర్చునేది. అదొక స్టేజిలాగా దానిమీదకెక్కి ఉపన్యాసాలిచ్చేది. పాటలు పాడేది.

ఇది వసుధ పుట్టి పెరిగిన ఇల్లు. తిరిగి ఇన్నేళ్ళ తర్వాత చూస్తుంటే మనసులో అదోలాంటి ఉద్విగ్నత! ఇప్పుడెలా వుందో వసుధ?

''పోన్లే ఇన్నాళ్ళకైనా వచ్చావు. ఇంతకీ ఎక్కడా వుండటం? పిల్లలెంతమంది? ఏం చదువుతున్నారు?'' ప్రశ్నల వర్షం కురిపించాడు రమణ.

''అమెరికాలో వుంటున్నాం. ఇద్దరు పిల్లలు. అమ్మాయి, అబ్బాయి. నీ కబుర్లేంటి?'' అడిగాను ఇల్లంతా పరికించి చూస్తూ.

''ఆ..ఏమున్నాయి? పిల్లలిద్దర్నీ రాజమండ్రిలో చదివిస్తున్నాను. ఈ ఇంట్లో వుండేది మేమిద్దరమే..'' చెప్పాడు రమణ.

''మీరిద్దరేనా? నానమ్మ, అత్త, మావయ్య వీళ్ళంతా..'' మధ్యలోనే ఆపేసాను.

''ముగ్గురూ లేరు. పోయి చాలా కాలమైంది..'' దిగులుగా అన్నాడు రమణ.

''ఓ..అయ్యాంసారీ'' నొచ్చుకుంటూ అన్నాను.

కబుర్ల మధ్య కాఫీ టిఫిన్లు అయ్యాయి. వసుధ మాటే ఎత్తని రమణని, నా అంతట నేను అడగడానికి కాస్త మొహమాట పడ్డాను.ఈ ఇంటి నిండా ఎటు చూసినా వసుధ జ్ఞాపకాలే! ఆ జ్ఞాపకాలు ఆమె కబుర్లు తెలుసుకోడానికి తొందర పడుతున్నాయి.

''నీళ్ళు తోడాను. స్నానం చేస్తారా..?'' రమణ భార్య వచ్చి పిలవడంతో స్నానానికి లేచాను.

ఎక్కడికో వెళ్ళబోతున్నట్టున్నాడు రమణ. చెప్పులు వేసుకుంటున్నాడు.

''నువ్వు కాస్సేపు రెస్ట్ తీసుకో..నేను పొలం దాకా వెళ్ళి..ఓ గంటలో వచ్చేస్తాను..'' రమణ వెళ్ళబోయాడు.

''పొలమా? అంటే కొబ్బరి తోటకే కదా..నేను వస్తాను పద..'' అన్నాను ఉత్సాహంగా.

''ప్రయాణం చేసొచ్చావు. ఎండలో ఎందుకు శ్రీధర్. కాస్సేపు పడుకో. ఇప్పుడే వచ్చేస్తాగా..'' నన్ను వారిస్తున్నట్టుగా అన్నాడు రమణ.

''నేనేం అలసిపోలేదులే. పైగా ఈ గోదారి గాలితగిలి

ఇంకాస్త హుషారొచ్చింది. ఒక్క నిముష వుండు. నేనూ వస్తాను'' అంటూనే గబగ డ్రెస్ చేసుకుని చెప్పులేసుకున్నాను.

''సరే..పద..'' అన్నాడు బైట నడుస్తూ!

అన్నేళ్ళ తర్వాత తిరిగి ఆ డొంకదారి వెం అలా నడుస్తూంటే, నా మనసంతా అనిర్వచ యమైన ఆనందంతో నిండిపోయింది.

''ఈ చెరువులో చిన్నప్పుడు మనం ఈ కొట్టే వాళ్ళం గుర్తుందా?'' నా వైపు చూ నవ్వుతూ అడిగాడు రమణ.

''గుర్తుందా అని అడుగుతున్నావా అసలు మరచిపోతే కదా, గుర్తు తెచ్చుకొనే దుకు..'' చెరువునీ, చెరువు ఒడ్డున తెల్ల మెరిసిపోతున్న రెల్లుపూలనీ చూస్తూ అన్నాను

''మనతో సమానంగా వసుధ కూడా చె వులో ఈతలు కొట్టేది కదూ! అన్నట్టు వసు ఎలా వుంది?'' ఆత్రుతని దాచుకోలే కంఠంతో అడిగాను.

ఎదురుగా వస్తోన్న ఎడ్లబండిని తప కుంటూ, రోడ్డుకి అటువైపు జరిగిన రమణ మాట వినిపించుకోలేదులా వుంది. సమాధాన చెప్పలేదు.

''అదిగో! వచ్చేసాం..రా..ఇదే మన కొ రితోట..'' నా భుజాల చుట్టూ చేయి వే నడుస్తూ అన్నాడు రమణ.

నేను తిరిగి వసుధ గురించి అడగ తుంటే, పాలేరు కాబోలు మాకెదురురొచ్చాడ

''ఏరా? అన్ని గెలలూ దించడం అయి యిందా?'' నన్ను వదిలి ముందు నడుస అడిగాడు రమణ.

''తాగరా శ్రీధర్! నువ్వు మన వూరి కొబ్బ నీళ్ళు తాగి ఎన్నాళ్ళయిందో..'' నా దగ్గరకొస అన్నాడు రమణ.

కొబ్బరి బొండాం అందుకున్నాను.

వసుధ గుర్తొచ్చింది.

తన స్నేహితురాళ్ళతో కలసి ఈ కొబ్బరితో లోనే తొక్కుడు బిళ్ళలాడేది. నన్నూ, రమణ వాళ్ళతో ఆడమని గొడవ చేసేది.


''నేనేం ఆడపిల్లనా, మీతో తొక్కుడు బి లాడ్డానికి?'' అని నేనంటే, ''ఏం, నేను మీతో ళ్ళీలాడ్డం లేదా?'' అంటూ వాదానికి దిగేది.

ఇంట్లో చెప్పొద్దని కూలీలకి, పాలేర్లకీ చె , తోటలో సైకిలెక్కి జోరుగా తిరిగేది.

''ఏం, మేం మీ మగవాళ్ళ కంటే దేన్లో క్కువ?'' స్పీడుగా సైకిలు తొక్కుతూ ధీమాగా అనేది.

''శ్రీధర్! కొబ్బరినీళ్ళు తాగకుండా అ నీలో నీవే నవ్వుకుంటున్నావేంటి?'' రమణ ప్రశ్నతో, త క్కకి తిప్పి అతని వైపు చూసాను.

వసుధ పోలికలు రమణలో చాలా న్నాయి. ముఖ్యంగా కొనదేలిన ఆ ముక్కు.



''వసుధ సైకిలు తొక్కడం గుర్తొచ్చింది..'' ఇంకా నవ్వుకుంటూనే అన్నాను.

''అవన్నీ నీకింకా గుర్తున్నాయా శ్రీధర్?'' రమణ కళ్ళల్లో పల్చని నీటి పొర మిట్టమధ్యాహ్నపు ఎండలో తళుక్కున మెరిసింది.

''ఎలా మరచిపోగలననుకున్నావు..?'' ఒక్క క్షణం ఆగి అడిగాను..''అన్నట్టు వసుధ ఎలా వుంది? పక్కవూర్లోనేనా ఉండటం?''

రమణ అవునన్నట్టు తలవూపి, ''ఒక్క నిమిషం'' అంటూ లేచి కూలీల దగ్గరకి వెళ్ళాడు. కోసిన గెలలవైపు చూపిస్తూ ఏదో చెబుతున్నాడు.

''నేను వస్తోన్న విషయం ముందే తెలిస్తే, వసుధే ఈ పాటికి పరుగెత్తుకు వచ్చి వుండేది. పోన్లే..ఇప్పుడు మాత్రం ఏమైంది. సాయంత్రం వెళ్ళేముందు వాళ్ళ వూరు వెళ్ళి వసుధని, పిల్లల్ని చూసి వెళ్తే సరి...''

భోజనాల దగ్గర..''వసుధ పిల్లలు ఎక్కడ చదువుతున్నారు?'' వసుధ కబుర్లు తెలుసుకోవాలనే ఆసక్తితో అడిగాను.

''హైదరాబాద్‌లో..'' క్లుప్తం ముభావంగా చెప్పాడు రమణ.

''ఏం చదువుతున్నారిప్పుడు?''

''అమ్మాయి మెడిసిన్ చేస్తోంది. అబ్బాయి మొన్న

**విశారద**

బి.టెక్‌లో చేరాడు..''

''ఒకళ్ళు డాక్టరు, మరొకళ్ళు ఇంజనీరు అన్నమ బావుంది. వసుధ పిల్లల చదువు విషయంలో చాలా తీసుకుంటున్నట్టుందే..'' అన్నాను ఆ రోజుల్లో వస చదువు మీద వుండే ఇంట్రెస్టుని గుర్తు తెచ్చుకుంటూ

''అవును. వసుధ చిన్నప్పటి నుండీ అనేది, వా బాగా చదవించాలని..'' తలొంచుకుని భోంచే చెప్పాడు రమణ.

''వసుధ ఎలావుంది? ఇప్పుడూ అలాగే లొడల కబుర్లు చెబుతోందా?'' వసపిట్టలా వాగే వసుధ గుర నవ్వుతూ అడిగాను.

రమణ సమాధానం చెప్పలేదు. నవ్వి వూరుకున్నా ఎందుకో ఆ నవ్వు చాలా ఉదాసీనంగా వుంది.

వసుధ గురించి ఏమైనా చెబుతాడేమోనని ఒక్కక్ష ఎదురుచూసాను.

నాకు చాలా డిసప్పాయింట్‌గా వుంది. ''ఏ వీడు? వసుధ కబుర్లు అడిగినాసరిగా చెప్పడు?'' పల నాకు రమణ మీద కాస్త కోపం వచ్చిన మాట నిజ

రెండు క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి.

నా మనసు వసుధ చుట్టూ తిరుగుతోంది. జీ గురించి ఎన్నో స్వప్నాలు, ఊహలు వున్న వసుధ వాటి స్వంతం చేసుకున్నదీ, తెలుసుకోవాలి. వసుధ జీవి జీవనం ఎలా వున్నదీ తెలుసుకోవాలి.

''రమణా! ఏవిటంత సీరియస్‌గా ఆలోచి న్నావు?'' అతని చేతి మీద సున్నితంగా తడు అన్నాను.

రమణ ఉలిక్కిపడి, అంతలోనే సర న్నాడు.''అబ్బే..ఏం లేదు..'' అంటూ నవ్వేసాడు. నవ్వులో ఏదో అసహజత్వం...నా మనసు సులభం పసిగట్టింది. ఒకవేళ నా రాక అతనికేమైనా ఇబ్బంది గించిందా? పాతజ్ఞాపకాలు గుర్తొస్తున్నాయా?

అమ్మ వసుధని తన కోడలిగా చేసుకుంటానని గడం, వసుధ వాళ్ళ నాన్న నాయనమ్మ అందుకు సి రించడం గుర్తొచ్చింది.

''రమణా! వసుధ ఎలా వుంది? స షంగా..హాయిగా వుందా?'' అతని మొహంలోకే చూ అడిగాను.

''నువ్వు కాస్సేపు పడుకో. నేను ఇప్పుడే వచ్చేస్తాన అంటూ లేవబోతున్న రమణని ఆపేసాను.

''ఐదు నిముషాలు ఆగి వెళ్ళువుగాన్లే వుండు..'' అన్నాను.

ఎందుకో, వసుధ విషయం వచ్చేసరికి రమణ చాలా ముభావంగా అయిపోతున్నాడ న్నది నాకు స్పష్టంగా అర్థమైంది. మిగతా విషయాల్లో గలగలా మాట్లాడుతున్న మనిషి, వసుధ గురించి అడిగితే, సాధ్యమై నంత క్లుప్తంగా చెబుతున్నాడు. అసలు విషయం నాకర్థం కావడం లేదు.

''వసుధ భర్త మంచివాడేనా? కలుపుగో లుగా వుంటాడా?'' కాస్త అనుమానంగా అడిగాను.

రమణ హఠాత్తుగా లేచాడు.

''ప్రయాణం చేసొచ్చావు. కాస్సేపు పడుకో. నేను ఓ గంటలో వచ్చేస్తాను..'' నా సమాధానం కోసం చూడ కుండా గబగబ అక్కడి నుండీ వెళ్ళిపోయాడు.

ఒక్కసారిగా అతని మొహం కఠినంగా మారిపోవడాన్ని గమనించాను. అయోమయంగా అతను వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయాను.

ఏం చేయాలో తోచలేదు. కిటికీ దగ్గరగా వెళ్ళి నిలబ డ్డాను. చెట్టంత విరగబూసి వున్న నంది వర్ధనం పూలని చూడగానే వసుధ నవ్వు గుర్తొచ్చింది.

ఎంత చక్కగా నవ్వేది! కల్లాకపటం లేని స్వచ్ఛమైన నవ్వు అది. అప్పుడు వసుధకి పదహారేళ్ళుంటా యేమో..చిలకాకుపచ్చ పట్టుపరికిణీని పైకి దోపి, గులాబీ రంగు ఓణీని నడుం చుట్టూ దోపి, పెరట్లో మావిడి చెట్టు కింద స్నేహితురాళ్ళతో తొక్కుడు బిళ్ళలాడుతోంది.

వసుధ నాయనమ్మ భ్రమరాంబగారికి ఆ గంతులు, చిందులూ నచ్చేవి కావు. ఆడపిల్లలు ఒద్దికగా, నెమ్మదిగా వుండాలనేది. వసుధ తొక్కుడు బిళ్ళాటని ఆవిడ చూడనే చూసింది.


''ఆడపిల్లవి కాదుటే నువ్వు? ఏవిటా ఇక ఇకలు..పక పకలు? ఇంకా చిన్న పిల్లననుకుంటున్నావా, ఎగురుతూ తొక్కుడు బిళ్ళలాడ్డానికి? హవ్వ...మన ఇంటా వంటా లేవే, ఆడపిల్లలు ఇలా గంతులు, చిందులూ వేయ డం..'' అంటూ దండకం అందుకుంది.

''నానమ్మా! ఎందుకలా కారం తిన్న కాకిలా అరుస్తావు కడుపునిండా తిన్నావు కదా, హాయిగా పడుకుని నిద్రపో రాదూ..నావెంట పడి..నా మీద అరవకపోతే నీకు తిన్నది అరగదా ఏంటి?'' వసుధ ఆట ఆపకుండానే అంది.

వసుధ సమాధానం విని ఆవిడ నిజంగానే కారం తిన్న కాకిలా అయింది. కోపంతో మండిపడుతూ అక్కడికొ చ్చింది.

''భయం..భక్తి లేకుండా తయారవుతున్నావే నువ్వు. మీ అమ్మ గారాం చేసి పాడు చేస్తోందే నిన్ను. రేపు వెళ్ళిన చోట కూడా ఇలాగే పెద్దా..చిన్నా లేకుండా మాట్లాడితే, అంతా మమ్మల్నే అంటారు..'' అంటూ విసురుగా వసుధ చెయ్యి పట్టుకుని బరబరా లోపలికి లాక్కువచ్చింది. ఉయ్యాల బల్లమీద కూర్చోబెట్టింది.

''ఇక్కడి నుండీ కదిలావా కాళ్ళు విరగ్గొడ్తాను..'' అంది కోపంగా.




వసుధ ఉయ్యాల బల్లమీద కూర్చుని స్నేహితురాళ్ళకి సైగ చేసింది. వాళ్ళంతా వచ్చి వసుధ పక్కనే కూర్చున్నారు.

భ్రమరాంబగారు ఓసారి వాళ్ళందరి వైపూ చూసింది.

''మీరంతా ఎందుకే ఈ పిల్లతో తిరుగుతారు? మీరూ దీనిలా తయ్యారవ్వడానికా? తాచెడ్డ కోతి వనమంతా చెరి చిందని..'' వసుధ వైపు గుర్రున చూస్తూ అంది.

వసుధ ఆవిడ మాటలు పట్టించుకోలేదు.

''ఇలా ఎంతసేపు కూర్చోవాలి? బోర్ కొడుతుంది నానమ్మా..'' వసుధ గారాలుపోయింది.

''నీ గారాలు నా దగ్గర కాదు. అంతగా తోచకపోతే, రుక్మిణీ కళ్యాణం చదువుకోరాదూ. త్వరగా పెళ్ళవు తుంది..'' అక్కడే నడుం వాలుస్తూ అంది ఆవిడ.

''రుక్మిణీ కళ్యాణమా? అదెప్పుడో చదివేసాను నానమ్మా..'' బుంగమూతితో అంది వసుధ.

''మరోసారి చదువు..మంచి మొగుడొస్తాడు..'' కునుకు తీస్తూ అంది భ్రమరాంబగారు.

వసుధ క్రీగంట ఆవిడవైపోసారి చూసింది. స్నేహితు రాళ్ళ చెవుల్లో ఏదో గుసగుసలాడింది. వాళ్ళు నవ్వుతూ 'సరే' అన్నట్టు చూసారు.

''నానమ్మా! ఏదైనా భక్తిపాట పాడనా? నాకేమీ తోచడం లేదు..'' సాధ్యమైనంత అమాయకంగా మొహం పెడ్తూ అడిగింది వసుధ.

ఆవిడ పడుకున్నదల్లా లేచి కూర్చుంది.

''మాతల్లే..దేవుడిపాట పాడతావా పాడు. వింటాను. ఎప్పుడూ ఆ మాయదారి గాలిపాటలు పాడతావు. భక్తి పాటలు పాడతానంటే కాదంటానా?'' అంది సంబరప డుతూ!

వసుధ ఏ పాటైనా కమ్మగా పాడేది. కాకపోతే గుణం కుదిరి భక్తి గీతాలు పాడ్డం తక్కువ. ఎప్పుడూ సినిమా పాటలు పాడి, నానమ్మ తిట్లని రేగుపళ్ళలా తినడంలోనే ఎక్కువ ఆనందం పొందేది! వసుధ ఉయ్యాల బల్ల మీదే బాసింపట్టు వేసుకుని బుద్ధిగా కూర్చుంది. కంఠం సవరిం చుకుంది. భ్రమరాంబగారి వైపు చూసి, నవ్వీ నవ్వనట్టు, చిన్నగా మందహాసం చేసింది. ఆ నవ్వులోని అల్లరిని ఆవిడ కనిపెట్టలేదు. మనవరాలి పాట వినేందుకు సిద్ధప డుతూ గోడకి ఆనుకుని కూర్చుంది.

వసుధ గళం పురివిప్పిన మయూరంలా జయదేవుల వారి 'దశావతారాల' అష్టపదినందుకుంది.

''ప్రళయ పయోధిజలే ధృతవానసి వేదం
విహిత వహిత్ర చరిత్ర మఖేదమ్
కేశవాధృత మీన శరీర..జయజగదీశ
హరే!''

భ్రమరాంబగారే కాదు. వీచే గాలి కూడా పరవశంగా వింటున్నట్టు, స్తంభించి పోయింది. ఎక్కడిదీ మాధుర్యం? జయదే వుడి అష్టపదిలోదా? మనవరాలి కంఠస్వరం లోదా? ఆవిడకి అర్థం కాలేదు.

వసుధ పాడుతూనే ఓరకంట నానమ్మని గమనిస్తోంది.

''మ్లేచ్ఛ నివహ నిధనే కలయసి కర వాలం

ధూమ కేతు మివ కిమపి కరాలమ్..''

హైపిచ్‌కి వెళ్ళి, ఆవిడ ఈ ప్రపంచాన్నే మరచి తాదాత్మ్యంలో మునిగిపోయిన క్షణాన..రసవత్తరంగా సాగుతున్న పాట హఠాత్తుగా ఆగింది!

గోడకి చేరగిలబడి కూర్చుని కళ్ళు మూసుకుని మరీ వింటున్న భ్రమరాంబగారు, రసభంగానికి కళ్లు తెరిచే లోపే, తిరిగి మరోపాట వినబడింది.

''అరెరె...ఎట్టాగో వున్నాది ఓలమ్మి..
ఏటేటో అవుతుందే చిన్నమ్మి...''

భ్రమరాంబగారు ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. అప్పటికే వసుధ లేచి నించుని ఉయ్యాల బల్ల మీద డాన్స్ చేస్తూ మరీ పాడుతోంది.

''ఓసి నీ ఇల్లు బంగారంగానూ, ఇప్పటిదాకా బాగానే పాడావుగదే..అంతలోనే ఏం మాయరోగం పట్టిందే నీకూ..'' కోపంగా వసుధవైపు వస్తూ అంది ఆవిడ.

వసుధ ఉయ్యాల బల్ల మీంచి ఒక్కదూకు దూకింది. నానమ్మకందకుండా తప్పించుకుంటూ మరో పాటందుకుంది.

''పచ్చగడ్డికోసేటి పడుచుపిల్ల...
నీ పైట కొంగు జారిందే గడుసుపిల్ల...''

''హవ్వ..హవ్వ'' ఆవిడ బుగ్గలు నొక్కుకుంది. ''ఎవరన్నా వింటే నవ్విపోతారు...ఆపవే ఆ పాడు పాట..రౌడీ దానా..'' అంటూ వసుధ వెంట పడింది.

వసుధ ఆవిడకి చిక్కకుండా తప్పించుకుంటూ మరో పాటందుకుంది.

''అద్దంలాంటి చెక్కిలి చూసి ముద్దొస్తుందంటావా?
చెంపకు చారెడు కళ్ళను చూసి చెంతకొస్తానంటావా?
అమ్మమ్మో సోగ్గాడా..''

ఆవిడ వసుధ వెనక పరుగెత్తలేక ఆగిపోయింది. కోపం మాత్రం నషాళానికి అంటింది. చురచురా చూసింది మనవరాలికేసి!

''నువ్వెంత బుద్ధిగా భక్తిపాట పాడతానన్నప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో చేస్తావని. రానీవే మీ నాన్నని..నీ సంగతి తేలుస్తాను..'' ఆయాసపడుతూనే వెంటాడకం సాగించింది.

వసుధ తన స్నేహితురాళ్ళతో కలిసి పారిపోతూ ''మా మానాన మేము ఏదో ఆడుకుంటుంటే, వచ్చి మా ఆట చెడగొడతావా? ఇంకోసారి ఇలా చేసావంటే ఇంకా వెత్తపాటలు పాడతాను..'' అంటూ బెదిరించింది.

వుత్త బెదిరింపుతో ఆగలేదు. పాడి చూపించింది.

''ముము ముముద్దంటే చేదా-నీకా ఉద్దేశ్యం లేదా?
ఇప్పుడొద్దన్నావంటే కుర్రవాడా
రేపు ఇమ్మన్నా ఇస్తానా వెర్రివాడా...''

''శివ..శివ..'' ఆవిడ రెండు చెవులూ మూసుకుంది. వసుధ కిలకిలా నవ్వుతూ బయటికి పరుగులు తీసింది.

గదిలో కూర్చుని చదువుకుంటున్న నేనూ, రమణ ఇదంతా చూస్తూనే వున్నాం నవ్వుకుంటూ! 'అల్లరి కూడా ఇంత అహ్లాదంగా వుంటుంది కాబోలు..' నవ్వుకుంటూనే అనుకొన్నాను.

★★★

వేప చెట్టుమీది కాకులు ఎందుకో ఒక్కసారి గట్టిగా అరిచాయి. దృశ్యం చెదిరింది. గతంలో నుండి బయటికొచ్చాను.

''ఎంత అల్లరి చేసేది వసుధ!'' నవ్వుకొన్నాను.

ఇప్పుడెలా వుంటుంది వసుధ?

ఆ అల్లరి, చిలిపిదనం స్థానే నిండుతనం, హుందాతనం చేరి వుంటాయా? పరుగులు పెట్టే పిల్లఏరు, నదిలో కలసి మంద్రగాంభీర్యాన్ని సంతరించుకున్నట్టు..అమ్మ అయిన అమ్మాయి గంభీరత్వాన్ని ఆపాదించుకున్న వైనం..చూడాల్సిందే మరి!

అవును! వసుధని ఓసారి చూడాలి.

అంతలో రమణ వాలకం గుర్తొచ్చింది. వసుధ మాటెత్తితే చాలు గంభీరంగా మారిపోవడం..విషయం సరిగా చెప్పక పోవడం...నాకేమీ అర్థం కాకుండా వుంది.

అసలేమై వుంటుంది? పల్లెటూర్లో షరామామూలే నన్నట్టు రమణకీ, వసుధ భర్తకీ ఎక్కడైనా తగాదాలు వచ్చాయేమో! అందుకే వసుధ భర్త గురించి అడిగినప్పుడు, ఆ కళ్ళల్లో క్రోధం తొంగి చూసింది. అన్నా చెల్లెళ్ళ మధ్య మాటలు కూడా లేవా కొంపదీసి? రెండిళ్ళ మధ్య రాకపోకలు వున్నాయో లేదో.

''ఇక బయలుదేరుతాను రమణా..'' అన్నాను నాలుగింటికి.

''లాంచీ ఇంకో రెండు గంటలకిగానీ రాదు. అప్పుడే ఎందుకు? కాస్సేపు ఇక్కడే కూర్చుని వెళ్ళండి..'' అంది రాధ.

''ఈలోపు వసుధ వాళ్ళ వూరు వెళ్ళి వసుధని చూసి వద్దాం రమణా! అరగంట ప్రయాణమేనన్నావుగా..'' అన్నాను రమణ వైపు చూస్తూ.

భార్యాభర్తలిద్దరూ అప్రయత్నంగా మొహమొహాలు చూసుకున్నారు.

''ఈసారి వెళ్ళొచ్చులేరా..'' అన్నాడు అయిష్టంగా మొహం పెట్టుకుని.

''ఈసారా? నేను మళ్ళీ ఇప్పుడప్పుడే రాలేను రమణా..'' అన్నాను అర్థం చేసుకోమన్నట్టుగా చూస్తూ.

రమణ ప్రవర్తన నాకేమాత్రం అర్థం కాకుండా వుంది.

''ఏం..నేను వెళ్తే వసుధకేమైనా ఇబ్బందా? ఆమె భర్త-'' మధ్యలో ఆపేసి సందేహంగా చూసాను.

''అహ..అలాంటిదేం లేదు..'' నసిగాడు.

''మరిక అభ్యంతరం దేనికి?'' సూటిగానే ప్రశ్నించాను.

''శ్రీధర్..నన్నేమీ అడక్కు..నేను చెప్పలేను..'' అన్నాడు రమణ.

నేను రమణ వైపు అలాగే కన్నార్పకుండా చూసాను. వాడి కళ్ళల్లో నీళ్ళు..సుళ్ళు తిరుగుతున్నాయి.

''నీకు రావడం ఇష్టం లేకపోతే, నేను ఒక్కణ్ణే వెళ్తానులే..''

''వద్దు..'' చప్పున అన్నాడు రమణ.

''వద్దా? ఎందుకు వద్దు?'' రెట్టించాను.

''వసుధ అక్కడ లేదు..''

''అక్కడా లేదా? మరెక్కడుంది?''

''వసుధ ఈ లోకంలోనే లేదు శ్రీధర్'' కళ్ళనీళ్ళతో అన్నాడు రమణ.

''అంటే యూ..మీన్'' నా కంఠం వణికింది.

''వసుధ పోయి పదేళ్ళయింది...'' రమణ చెప్పలేక చెప్పాడు.

తలమీద పిడుగుల వర్షం పడినట్టు..మనసులో ఒక పెను విస్ఫోటనం జరిగినట్టు అదిరి పడ్డాను. ఆపాదమస్తకమూ దుఃఖాన్నే అయ్యాను.

''ర..మ..ణా'' ఏదో అడగబోయాను కానీ గొంతు పెగల్లేదు.

దుఃఖాన్నీ, ఆవేదననీ బలవంతాన గుండెల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తూ శిలలా కూర్చున్నాడు రమణ. కన్నీళ్ళని ఆపే శక్తి తమకి లేదన్నట్టు కళ్ళు తమ నిస్సహాయతని ప్రకటించాయి.

చెమ్మగిల్లుతున్నది కళ్ళే కాదు, గుండె కూడా!

''అసలేమైంది?'' అతికష్టం మీద మాటలు కూడదీసుకుని అడిగాను.

''మనుషులు తెలిసి తెలిసి కొన్ని తప్పులు చేస్తారు. అది తప్పని తెలిసే సరికే అంతా అయిపోతుంది. వసుధ పెళ్ళి విషయంలో నానమ్మా వాళ్ళు తీసుకున్న తొందరపాటు నిర్ణయం, వసుధ జీవితాన్నే బలి తీసుకుంది''

''అవును. అప్పట్లో విన్నాను. అతను మంచి వాడు కాదని. దురలవాట్లు ఏవో వున్నాయని..'' హఠాత్తుగా అమ్మ చెప్పింది గుర్తొచ్చి అన్నాను.

''వసుధ అతన్ని భరించలేక, కలసి బ్రతకలేక, ఈ గోదార్లోనే కలసిపోయింది..'' చేతుల్లో మొహం దాచుకున్నాడు రమణ.


నా మనసులో మరో పెను విస్ఫోటనం!

''గోదార్లోనా? అంటే..'' రమణ చేతులు పట్టుకుని అడిగాను.

''గోదార్లో దూకి ఆత్మహత్య చేసుకుంది..''

ఒక్కక్షణం వూపిరి అందనట్టు గిలగిలకొట్టుకున్నాను. నిజాన్ని జీర్ణించుకోలేక మనసు రగిలిపోయింది.

నేనెంత మాత్రమూ ఊహించని పరిణామమిది.



నేను నిశ్చేష్టుణ్ణే అయ్యాను.వసుధ ఇలా చేం  గల దంటే నాకు నమ్మబుద్ధి కావడం లేదు.

మాతో సమానంగా సైకిలు తొక్కుతూ, ''ఏం వే  మీ మగవాళ్ళకన్నా దేన్లో తక్కువ..'' అంటూ ధీమాని ప  పర చిన వసుధ-

ఎవరో ప్రేమలేఖ రాస్తే, అందరి ఆడపిల్లల్లా  యు పడి అన్నయ్యకు, నాన్నకు చెప్పకుండా, తన వా  తు ర్యంతో ప్రేమలేఖ రాసిన వాణ్ణి పడలు గొట్టిన వసు

నదురు బెదురులేకుండా, నానమ్మకి తాతరాసి  గా ప్రేమలేఖ రాసి అందర్నీ నవ్వించిన వసుధ..

పెళ్ళి చూపులకొచ్చిన పెళ్ళి కొడుకుని నేనే కొని  ప్రశ్న లడుగుతాను అంటూ ధైర్యాన్ని ప్రదర్శించిన వసు

అలాంటి వసుధ ఆత్మహత్య చేసుకోవడమా? ఆత్మ హత్య చేసుకునేటంత పిరికిదా వసుధ?

ఏ దయనీయ పరిస్థితులు తననలా తరిమికొ  యి!

ఏ హాలాహలాన్ని దిగమింగలేక ఆమె తన జీ  తాన్ని అలా అంతం చేసుకుంది?ఏదో జరిగింది..

''అసలు మీరంతా ఏం చేస్తున్నారు? వసు  పరిస్థి తిని మీరెందుకు అర్థం చేసుకోలేకపోయారు? ఏ  నుకు కాపాడుకోలేక పోయారు?'' ఆవేశంగా రమణ భ  జాలు పట్టి కుదిపేసాను.

రమణ తప్పుచేసిన వాడిలా తలదించుకున్నా

''అసలేం జరిగింది?'' ఆవేదనగా అడిగాను

''వసుధ భర్తకి లేని వ్యసనమంటూ లేదు.  టినీ, సంసారాన్నీ పట్టించుకోక పోవడం అటుంచి,  సుధ పాటలు పాడినా, పుస్తకం చదివినా సహించే వా  కాద ట..చివరికి నవ్వినా వూరుకునే వాడు కాద ట.  తనికి తోడు వాళ్ళత్తగారు కూడా చేరి సాధించేదట..''  మణ చెబుతున్నాడు.

నాకు కడుపు తరుక్కుపోయింది. ఎన్నో ఆశ  , కల లతో తన జీవితంలోకి నడచి వచ్చిన భార్య  కష్టపె ట్టడం..మనసెలా ఒప్పుతుంది ఒక మగవాడికి!

''ఇక్కడికి వచ్చినప్పుడల్లా, ఇక అత్తగారిం  వెళ్ళ నని ఏడ్చేది. కానీ, నానమ్మా వాళ్ళు వూరు కోలే  పెళ్ళ యిన పిల్ల కాపురాన్ని ఒదులుకొని వచ్చి  ట్టింట్లో కూర్చుంటే పరువు తక్కువ అని నలుగురూ నా  రకా లుగా అంటారని, మళ్ళీ బలవంతాన పంపేవాళ  కళ్ళ నీళ్ళతో అన్నాడు రమణ.

రమణ మాటలు వింటుంటే నా రక్తం మరగిపోయింది. ఆవేశం ఉప్పెనలా విరుచు కుపడింది.

''అదే..అదే..మన పెద్దవాళ్ళు చేస్తున్న తప్పు. ఒక ఆడపిల్లకి ఏం కావాలో, ఎలాంటి మనస్తత్వం వున్న అబ్బాయితో అయితే హాయిగా జీవించగలదో ఆలోచిం చరు. పెళ్ళి తర్వాత, దురదృష్టం కొద్దీ అను కోని పరిణామాలు సంభవించి, అమ్మాయి నరకయాతన అనుభవిస్తున్నా, ఆ మనిషితో కాపురం చెయ్యలేను మొర్రో అని మొత్తు కున్నా, చావో-బతుకో అక్కడే పడుండమం టారు. ఆ పరిస్థితుల్లోంచి బయటపడ్డానికి చేయూత నివ్వరు. ధైర్యాన్నివ్వరు. ఆత్మవిశ్వాసాన్ని అందించరు. కళ్ళముందు బతుకులు బండలవుతున్నా పరువు గౌరవం అంటూ నీతులు చెబుతుంటారు. పిరికిత నాన్ని ఇంజెక్ట్ చేస్తారు. ఆ అమ్మాయి బతకలేక ఆత్మహత్య చేసుకున్నాక, అప్పుడు తీరిగ్గా ఏడుస్తారు. అసలు ఏం కావాలిరా ఈ పెద్దవాళ్ళకి? ఏం చూసి చేస్తార్రా వీళ్ళు పెళ్ళిళ్ళు? ఒక ఆడపిల్ల పుట్టింటికి వచ్చి వుండిపోతే, పోయే పరువు మర్యాదలు ఎందుకురా మనకి? ఇప్పుడు ఏం చేస్తే వసుధ తిరిగి వస్తుంది చెప్పు...'' ఆవేశంగా రమ ణని పట్టి కుదిపేసాను.

నా ఆవేశాన్నీ, బాధనీ చూడలేక రమణ తలదించుకు న్నాడు.

''రోజూ ఎంత మంది ఆడపిల్లలు నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? మరెందరు అత్తగారి ళ్ళల్లో హత్యలు చేయబడుతున్నారు? ఇదంతా ఎందు కని? పుట్టింటి అండ, ఆదరణ, ఆశ్రయం వాళ్ళకి లేకపో బట్టిగా..భర్త మంచి వాడు కాక, తనని నరకయాతనకి గురి చేస్తుంటే, భరించలేక ఓ ఆడపిల్ల పుట్టింటికి వచ్చేస్తే..పరువుపోతుందా? అంతే..అంతేరా మన పెద్ద వాళ్ళు..ఆడపిల్లని తన కాళ్ళ మీద తను నిలబడేలా చేయూతనివ్వరు. ఆత్మవిశ్వాసానికి ఊపిరులూ దరు...నీకు మేం వున్నాం..మరేం భయం లేదు అని అండగా నిలబడరు. పిల్ల ప్రాణాలు పోయినా ఫర్వా లేదు..పరువు మిగిలిందని తృప్తిపడతారు..'' నేను దుఃఖాన్ని ఆపుకోలేకపోయాను.

రమణ చెయ్యి ఓదార్పుగా నా భుజాల మీద పడింది.

''లేదు రమణా! ఆడపిల్లల్ని ఇలా కాదు పెంచా ల్సింది. ఎలాంటి పరిస్థితుల నైనా ఎదుర్కొనే మనోబ లాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వాళ్ళలో పెంచాలి. ఖర్మకొద్దీ చేసు కొన్న వాడు మంచివాడు కాకపోతే, ఆ పరిస్థితిని ఎదుర్కొ నేందుకు ధైర్యాన్నివ్వాలి. ఒక నమ్మకాన్ని ఇవ్వాలి..ఒక ఆదరణ నివ్వాలి. మీరలా చేసి వుంటే వసుధ ఆత్మహత్య చేసుకునేదే కాదు. మీరంతా కలిసి వసుధకి చాలా అన్యాయం చేసారు రమణా...ఒక అమాయకురాలి జీవి తానికి చితి అంటించారు..'' కోపంగా అన్నాను.

రమణ గాయపడ్డట్టు బాధగా చూసాడు. మాట్లాడ్డా నికి ఏవీ లేనట్టు మౌనంగా కూర్చున్నాడు.

క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోతున్నాయి.

''నేను ఇప్పుడు ఈ వూరు వచ్చి చాలా పొరబాటు చేసాను రమణా..రాకుండా వుంటే బావుండేది..నా మన సులో వసుధ ఎప్పటికీ సజీవంగా వుండేది. ఇప్పుడీ బాధనీ, వసుధలేదన్న నిజాన్ని ఎలారా నాతో మోసుకువె ళ్ళేది?'' ఆవేదనగా అన్నాను.

''అందుకే శ్రీధర్..నీకీ నిజాన్ని చెప్పకూడదనే అనుకు న్నాను. నువ్వు వచ్చినప్పటి నుండీ ఎన్నిసార్లు, ఎన్ని రకా లుగా అడిగినా, నేను చెప్పలేకపోయాను. వసుధ గురించి నువ్వు అడుగుతుంటే, ఎంత నరకయాతన ననుభవిం చానో తెలుసా?'' బాధగా అన్నాడు రమణ.

మనుషుల బంధాలు చాలా విచిత్రమైనవి అని తెలిసి కూడా, మనిషి ఆ చిత్రమైన సంబంధాలను వదులుకునేం దుకు ఇష్టపడడు. అలాగే జ్ఞాపకాలూను! కొన్ని జ్ఞాపకా లని మరచిపోయేందుకు మనసు ఇష్టపడదు.

''శ్రీధర్! లే..అదిగో పడవ బయల్దేరబోతోంది..'' బయల్దేరడానికి సిద్ధంగా వున్న లాంచీ వైపు చూపిస్తూ అన్నాడు రమణ.

నేను నిస్సత్తువగా..లేవడానికి కూడా శక్తిలేనట్టుగా అలాగే కూర్చుండిపోయాను.

''శ్రీధర్! పడవెళ్ళిపోతుంది లే..'' మళ్ళీ చెప్పాడు రమణ.

''అసలు పడవ ఎప్పుడో వెళ్ళిపోయింది రమణా! నేను, వసుధ కలిసి ప్రయాణం చేయాల్సిన పడవ ఎప్పుడో వెళ్ళిపోయింది. తీరాలు వేరైపోయాయి ఎప్పుడో..'' అనుకున్నాను భారంగా!

రమణ అందించిన చేతిని పట్టుకుని మౌనంగా లేచాను.మాట్లాడుకోడానికి ఏదీ మిగలనట్టు మౌనంగా నడుస్తున్నాం.

ప్రొద్దున ఈ నది ఒడ్డున ఎంత ఆనందంగా అడుగు పెట్టాను? ఇప్పుడు మోయలేని దుఃఖాన్ని మూట కట్టు కుని వెళ్తున్నాను.

సూర్యోదయంతో ఆనందంగా మొదలైన ఒక అంద మైన కథ ఏదో, సూర్యాస్తమయంతో విషాదంగా ముగిసిన ట్టయింది.

వసుధ లేదు. ఈ తీరంలో ఒకప్పటి ఆమె అడుగుజా డలున్నాయి.

ఈ గాలిలో..ఒకప్పటి ఆమె ఊపిరులున్నాయి.

ఇద్దరం కలిసి లాంచీ దాకా వచ్చాం.

రమణ ఒడ్డునే వుండిపోయాడు.. నేను మౌనంగా వీడ్కోలు తీసుకున్నాను.

లాంచీ మెల్లగా కదిలింది. వెనక్కి తిరిగి చెయ్యూపాను.

కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ రమణ ఒడ్డున నిలబడి, దూరమవుతున్న నన్ను చూస్తూ నిలబడిపోయాడు.

నన్నూ, నా దుఃఖభారాన్ని కూడా మోస్తూ, తీరాన్ని వదిలి పడవ దూరంగా వెళ్ళిపోతోంది. ఒక అందమైన కథని ముగించి...

★

